మృతులకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో మృతి చెందిన వారికి శుక్రవారం సూరారం డివిజన్ నెహ్రూనగర్ సాధన హైస్కూల్‌లో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త మధుబాబు చికిలె, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. విమాన ప్రమాదం దేశ ప్రజలను తీవ్రంగా కలచి వేసిందని, ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు దేశ ప్రజలు అండగా ఉండాలన్నారు. మృతులకు సంతాప సూచికగా రెండు నిముషాల పాటు మౌనం పాటించారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

జగద్గిరిగుట్ట : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ అన్నారు. శుక్రవారం శ్రీనివాస్‌నగర్, మగ్దూం నగర్ మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఉచిత పుస్తకాలను, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషన్, మహిపాల్, చంద్రకళ, గాయత్రి, బెస్లి, శైలజ, గాయత్రి పాల్గొన్నారు.

చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం


అవగాహన కల్పిస్తున్న కళా జాతర సభ్యులు

దుండిగల్: చెత్తరహిత మున్సిపల్‌గా దుండిగల్‌ను తీర్చిదిద్దడంలో ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ కోరారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' అనే నినాదంతో శుక్రవారం గండి మైసమ్మ చౌరస్తాలో కళా జాతర నిర్వహించినారు, ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారుల బృందం సభ్యులు తడి, పొడి చెత్త పైన పాటల రూపంలో అవగాహన కల్పించారు. అదే విధంగా ప్లాస్టిక్ బ్యాన్, పరిసరాల పరిశుభ్రత మొదలగు వాటిపైన వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ సురేందర్ నాయక్, ఎన్విరానిమెంట్ ఇంజినీర్ సాత్విక్, వార్డు ఆఫీసర్లు, మెప్మా మహిళా గ్రూప్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డా?.. పార్కింగ్ స్థలమా?



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్ నుంచి మీనాక్షికి వెళ్లే రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అటువైపు వచ్చి పోయే వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. ఈ సర్వీస్ రోడ్డులో నిత్యం ఇదే తరహాలో పార్కింగ్ చేయడం పై ఇటీవల అల్వాల్ ట్రాఫిక్ పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం విశేషం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు బ్రేక్!



కుత్బుల్లాపూర్ : జాతీయ రహదారి- 44 సుచిత్ర నుంచి కొంపల్లి వరకు ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అయితే 47 రోజుల నుంచి ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నిలిచిపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు పనులు నిలుపుదల చేసినట్లు తెలిసింది. ఎంతో వేగంగా జరుగుతున్న పనులు అకస్మాత్తుగా నిలిచిపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై సంబంధిత అధికారులను అడిగితే అదేం లేదు .. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పడం విశేషం.

బాధ్యత మరిచి.. చెత్తను వేసి!



కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి రంగా భుజంగా థియేటర్ కు వెళ్లే రోడ్డులో ఇష్టానుసారంగా చెత్తను వేసి వెళ్తున్నారు. స్థానికంగా సిబ్బందిని నియమించి శుభ్రం చేస్తున్నప్పటికీ ఉదయం, సాయంత్రం వేళల్లో కొంతమంది వ్యక్తులు ఇక్కడ చెత్తని వేసి వెళ్లడం విశేషం. సీసీ కెమెరాల విధానాన్ని అమలుపరిస్తే ఇక్కడ చెత్తను వేసే వారిని కట్టడి చేసే అవకాశం ఏర్పడుతుంది. ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని పలువురు కోరుతున్నారు.

గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్


కళాశాల ప్రవేశ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

కుత్బుల్లాపూర్: మహిళా విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని, గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట (శామీర్ పేట) 2025-26 సంవత్సరానికి గాను ప్రవేశాలకు సంబంధించిన కరపత్రం, వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల మహిళా డిగ్రీ కళాశాలల్లో ఉత్తమ విద్యతో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. అడ్మిషన్ వివరాల కోసం 9640373202, 8309042565, 9666762726, 6301211683 నంబర్లలో సంప్రదించాలని కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అడ్మిషన్ కో ఆర్డినేటర్ డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

◆ కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయభేరి పార్క్ కాలనీలోని సీతారామ సంజీవని ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారిని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తవుతుంది. దీంతో శుక్రవారం అభిషేకం, హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, ప్రభాకర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వాసుదేవారెడ్డి, జీవన్ రెడ్డి, వినోద్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నరసింహారెడ్డి, రవీందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

'ఒక మార్పు అభివృద్ధికి మలుపు'


ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

నిజాంపేట్: 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌లలో మున్సిపల్ అధికారులు స్థానిక ప్రజలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెత్తను తగ్గించు పర్యావరణాన్ని కాపాడు, వ్యర్థాలు లేకుండా జీవిద్దాం, చెత్త నిర్మూలన మంచి భవిష్యత్‌కు దారితీస్తుందనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తడి, పొడి, హానికరమైన చెత్త గురించి, వాటిని ఎలా వేరు చేయాలో సంబంధిత అధికారులు వివరించారు. మూడు విధాలుగా చెత్తను సేకరించడం కోసం ప్రతీ ఇంటికి మూడు రంగులు గల మూడు బుట్టల చొప్పున అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొలెపాక వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, సభ్యులు జీతయ్య, సుధాకర్‌రెడ్డి, దేవేందర్, రమేష్, అబీబ్, పెంటయ్య, గురవయ్య, వెంకట్, మాధవ్, అధికారులు జయరాజ్, హేమలత, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉత్తమ విద్యను అందిస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డినగర్ డివిజన్ గురుమూర్తినగర్ ప్రభుత్వ పాఠశాలలో మనబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా బడిలో చేరిన విద్యార్థులతో అక్షరాభాస్యం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయరాం, డివిజన్ అధ్యక్షుడు గణేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు మాధవి రాణి, జానకి, భాగ్య, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి షటిల్ టోర్నమెంట్

జీడిమెట్ల: ఎస్.ఆర్.నాయక్ నగర్‌లోని జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలో శనివారం, ఆదివారం షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా నిర్మించిన ఈ స్టేడియంలో ఏసీఈ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వాహకులు సూరిబాబు, దిలీప్‌లు టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు పోటీలను ప్రారంభించనున్నారు.

మల్లంపేట్‌లో 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు'

దుండిగల్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్‌లో 'రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత రైతులకు తక్కువగా యూరియా వాడటం, ఎక్కువగా ఉండటం వల్ల కలిగే భూజలాల కాలుష్యం, పర్యావరణ కాలుష్యాలపై వివరించారు. ఎరువుల వాడకాన్ని తగ్గించి వాటికి బదులుగా పచ్చిరొట్ట, జీలుగు జనుము వేసుకోవాలని సూచించారు. సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. మండల వ్యవసాయ అధికారి యాదగిరి మట్టి నమూనా సేకరణ, పరీక్షల ఆవశ్యకత, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై వివరించారు. కూరగాయలు పండించే రైతులు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు దామయ్య, గణేష్, మోహన్‌రావు, రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్.. సన్మానం



నిజాంపేట్: నేషనల్ ఛాంపియన్ బాక్సింగ్ పోటీల్లో ఇందిరమ్మ కాలనీ షేజ్3 నివాసులు దస్తగిరి, కవితల కుమారుడు కృష్ణ కిషోర్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. కృష్ణ కిషోర్ మే నెల 28న జూబ్లిహిల్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో సీఎం పురస్కారాన్ని అందుకున్నాడు. విజేతకు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

చింతల్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను అధిగమించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేస్తామని బోయినపల్లి డీఈ గోపాలరావు అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లి డీఈ ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినియోగదారుల పరిష్కార వేదికను డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 21 మంది తమ సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా లూస్ లైన్, విద్యుత్ పోల్ డ్యామేజీలు, హెచ్‌డీ లాగిన్ బిల్డింగ్ తదితర సమస్యలపై అధికంగా వచ్చినట్లు డీఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి డివిజనల్ చైర్ పర్సన్, టెక్నికల్ మెంబర్లు, ఫైనాన్స్ మెంబర్లు, కన్జ్యూమర్ ఎఫైర్స్ మెంబర్స్, ఏడీఈలు, ఏఈలు, ఈఆర్వోలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు శ్రీకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ సబ్ స్టేషన్ ఫిరోజ్‌గూడ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఫిరోజ్‌గూడ, కోయబస్తీ, గవర్నమెంట్ స్కూల్ గల్లీ, పోచమ్మ టెంపుల్ లైన్, అంతమ్మ గూడా, వీవీఆర్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.:30 నుంచి 5.30 గంటల వరకు బాలానగర్ మెయిన్ రోడ్డు, రాజు కాలనీ, సాయి కాలనీ, ఫూల్‌బాగ్ ఫేజ్ 1, ఫూల్‌బాగ్ ఫేజ్ 2, బీహెచ్‌ఈఎల్ ఆర్‌ఎండీ, బాలానగర్, బాలానగర్ పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్, ఫిరోజ్ గూడా మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

